క్లుప్తంగా

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

రేపల్లె డీఎస్పీ మురళీకృష్ణ

భట్టిప్రోలు: అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని రేపల్లె డీఎస్పీ కె.మురళీకృష్ణ హెచ్చరించారు. భట్టిప్రోలు పోలీస్ స్టేషన్‌ను ఆదివారం తనిఖీ చేశారు. సాధారణ తనిఖీల్లో భాగంగా ఆయన విచ్చేసి పోలీస్ స్టేషన్ రికార్డులను పరిశీలించారు. మురళీకృష్ణ మాట్లాడుతూ సంఘ విద్రోహ శక్తులతో అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు. కోడిపందేలు, జూదం వంటివి నిర్వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. బహిరంగంగా మద్యం తాగి మత్తులో మందుబాబులు చేస్తున్న ఆగడాలు ఇకపై చెల్లవని చెప్పారు. ఆయన వెంట సీఐ వెంకటేశ్వరరావు, ఎస్ఐ వై.సురేష్ ఉన్నారు.

బండ్లమ్మ అమ్మవారికి వైభవంగా పూజలు



చందోలు(పిట్టలవానిపాలెం): స్థానిక బగళాముఖి బండ్లమ్మ అమ్మవారి దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పసుపు, కుంకుమలతో అర్చనలు, అభిషేకాలు జరిపించారు. భక్తులు పొంగళ్లు పొంగించి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి కొబ్బరి కాయలు కొట్టి మొక్కుబడులు తీర్చుకున్నారు. బండ్లమ్మ దేవాలయంలో పూజాద్రవ్యముల విక్రయ దుకాణం హక్కు కోసం మార్చి ఒకటో తేదీ బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి జి.నరసింహమూర్తి తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, సభ్యులు పెనుగొండ బాలకృష్ణమూర్తి, అర్చకులు కుంచల నరసారెడ్డి, బళ్ళారెడ్డి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

భట్టిప్రోలు: వెల్లటూరు ఫీడర్‌లో విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా సోమవారం సరఫరా నిలిపివేయనున్నట్లు ఇన్‌చార్జి ఏఈ పి.ఏడుకొండలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలుపుదల చేయనున్నట్లు వివరించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

క్రికెట్ విజేత కేసీఏసీ జట్టు



కొల్లూరు: కొల్లూరు ప్రీమియర్ లీగ్ పేరుతో నిర్వహించిన క్రికెట్ పోటీలు రసవత్తరంగా సాగాయి. ఆదివారం కొల్లూరు బాలురోన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించిన పోటీలలో పాల్గొన్న జట్లు గెలుపు కోసం హోరాహోరీగా పోరాడాయి. ఫైనల్ మ్యాచ్‌లో కొల్లూరుకు చెందిన కేసీఏసీ జట్టు విజేతగా నిలిచింది. పోటీలో గెలిచిన జట్టుకు నిర్వాహకులు కప్‌ను అందజేశారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

అద్దేపల్లి(భట్టిప్రోలు): స్థానిక పాఠశాల ఆవరణలో చెరుకుపల్లి శ్రీ కామాక్షి ఐకేర్ సహకారంతో పాస్టర్ సీహెచ్ తిమోతి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. డాక్టర్ వాసుదేవరావు, వైద్య బృందం 150 మందికి కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు భారతుల శ్రీధర్, ఉపాధ్యాయురాలు హవెలా ప్రశాంతి, బాబూజి పాల్గొన్నారు.

పోష్టి కాహారం పంపిణీ

మోపర్రు(వేమూరు): ఎన్టీఆర్ జయంతి వేడుకల్లో భాగంగా ఎన్టీఆర్ సేవా సమితి విద్యార్థులకు పౌష్టికాహారం అందజేసినట్లు మాజీ ఎంపీపీ మైనేని రత్న ప్రసాద్ తెలిపారు. అమృతలూరు మండలంలోని మోపర్రులో ఏఆర్‌సీ హాస్టల్ పోష్టి కాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆళ్ల అంకమరావు, గ్రంధి సురేష్, మళ్ళీ పెద్ది సరివిజ్ఞ, కొండపల్లి వెంకటేశ్వర్లు, నన్నపనేని అనిల్ పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు..

బాపట్ల అర్బన్: బాపట్లలో బీసీ హాస్టల్ విద్యార్థులకు బాపట్లకు చెందిన కోట రహీం రెడ్డి ఆదివారం నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారతదేశం గొప్పతనాన్ని వివరించారు.

వ్యక్తి ఆత్మహత్య

గుంటూరు ఈస్ట్: వ్యక్తి ఆత్మహత్యపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. దేవాపురం 5వ లైనులో నివసించే బూదాల బాలరాజు (40)తాపీ పనులు చేసి జీవనం సాగిస్తుంటాడు. ఇటీవల తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతున్నాడు. దీంతో శనివారం ఇంట్లో ఎవరులేని సమయంలో ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యల పరిష్కారానికే గడప గడపకు..

- మంత్రి మేరుగ నాగార్జున
- తురిమెళ్లలో గడప గడపకు మన ప్రభుత్వం



సంక్షేమ పథకాలు గురించి వివరిస్తున్న మంత్రి మేరుగ నాగార్జున

తురిమెళ్ల(వేమూరు): ప్రజలు స్థానికంగా ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున తెలిపారు. అమృతలూరు మండలంలోని తురిమెళ్లలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. మంత్రి ప్రతి గడప గడపకు వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అమలు తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సమస్యలు తమ దృష్టికి తీసుకొచ్చిన వెంటనే నిధులు మంజూరుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ప్రధానంగా రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి ఇప్పటికే ప్రాధాన్యం ఇచ్చినట్లు వివరించారు. భవిష్యత్‌లో మరిన్ని నిధులతో అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషితో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరుతోందని తెలిపారు. ఇంకా పథకాలు మంజూరు కాకుంటే గ్రామ సచివాలయంలో అర్జీ అందిస్తే మంజూరుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎన్ని ఆటంకాలు వచ్చినా రాష్ట్రంలో సంక్షేమ పాలన కొనసాగుతోందన్నారు.

కార్యక్రమంలో ఎంపీపీ రాపర్ల నరేంద్ర, కొసరాజు వెంకట బసవేశ్వరరావు, కోళ్లపూడి అశోక్, గ్రామ సర్పంచి ఆడుసుపల్లి ఇందిర, సొసైటీ అధ్యక్షులు యలవర్తి సురేష్, ఆడుసుపల్లి వీరయ్య, ఎంపీటీసీ మానుకొండ ఝాన్సీరాణి, పేర్ల వెంకట సుబ్బారావు, ముక్కాల గిరి, బట్టు మోషే, గుమ్మడి రవిరాజా, రావి ప్రసాద్, దారా శ్రీనివాసరావు, గుర్రం మధు పాల్గొన్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి దర్భా బాబూరావు



దర్భా బాబూరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న భవానీదేవి

బాపట్ల: దర్భా బాబూరావు బహుముఖ ప్రజ్ఞాశాలి అని సుప్రసిద్ధ రచయిత్రి చిల్లర భవానీదేవి వర్ణించారు. బాబూరావు వర్ధంతిని ఆదివారం గ్రంథాలయంలో నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్ట్స్ అండ్ సైన్సు కళాశాల రిటైర్డు కామర్స్ అధ్యాపకుడిగా ఎందరో విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దారని గుర్తు చేసుకున్నారు.

కార్యక్రమంలో లైబ్రేరియన్ ఏ శివాజీ గణేష్, విశ్రాంత అధ్యాపకులు జి.శాంతారామ్, పి.ప్రసాద్, మోహన్‌రావు, చిత్రకారుడు జీవి, కవి మల్లికార్జున, న్యాయవాది బాషా, రాంగోపాల్, కేవీ అప్పారావు, శ్రీధర్, డాక్టర్ పీసీ సాయిబాబు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో భవ్యేష్ వర్మకు రజత పతకం



తెనాలి అర్బన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి కరాటే ఇన్విటేషనల్ చాంపియన్ షిప్– 2023 పోటీల్లో తమ విద్యార్థి జంపని భవ్యేష్ వర్మ రజత పతకం సాధించినట్లు మైటీ స్పోర్ట్స్ అకాడమి జనరల్ సెక్రటరీ గుర్రం అనిల్ కుమార్ తెలిపారు. పోటీల్ని ఒంగోలులో ఆదివారం నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. రజత పతకం సాధించిన భవ్యేష్ వర్మను సోమవారం ఆయన పట్టణంలోని అకాడమిలో అభినందించారు.

సముద్రమంత ఆనందం



నిజాంపట్నం జెడ్పీ హైస్కూల్ 1988-89 బ్యాచ్ విద్యార్థులు

1988–89 పది బ్యాచ్ విద్యార్థుల సమ్మేళనం

నిజాంపట్నం: ఆనాటి రోజులు మరుపురాని రోజులు.. చదువులో ఒడిలో స్వేద తీరిన రోజులు.. అడుగుఅడుగున జ్ఞాపకాల పందిరిలో గూడుకట్టుకున్న రోజులు.. మళ్లీ మళ్లీ రావాలని కోరుకునే అవే పాఠశాల రోజులు. పాఠశాల రోజులను గుర్తుచేసుకుంటూ 33 ఏళ్ల తరువాత సమ్మేళనం నిర్వహించుకున్నారు. అదీ సముద్ర తీరంలో.. ఆనందానికి అవధులేకుండాపోయారు. స్థానిక జెడ్పీ హైస్కూల్లో 1988–89 బ్యాచ్ 10వ తరగతి విద్యార్థులు నిజాంపట్నం హార్బర్‌లో సముద్రతీరాన ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఏర్పాటు చేసుకున్నారు. సుమారు 33 సంవత్సరాల తరువాత కలుసుకోవడంతో కేరింతలు కొట్టారు. ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. సముద్ర తీరాన ఆహ్లాదకర వాతావరణంలో తిరుగుతూ పాఠశాలలో ఆనాడు గడిపిన తీరును గుర్తుచేసుకుంటూ ఎంతో ఆనందంగా గడిపారు. స్నేహితులందరు ఒకరికొకరు ఫొటోలను దిగి తమ తీపిగుర్తుగా దాచుకున్నారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు ప్రసాదం వాసుదేవ, నర్రా నాగేశ్వరరావు, మోపిదేవి నాగరాజు, సరళకుమార్, నీలా బాలకోటేశ్వరరావు, కొక్కిలిగడ్డ వెంకటేశ్వరరావు, కాశేపల్లి శ్రీనివాసరావు, మల్లికార్జునరావు, గీతావాణి, నాళ్ళం పద్మజ, గ్రంధి భవాని, మల్లేశ్వరి, బెల్లంకొండ ఆదినారాయణ, శ్రీధర్ పాల్గొన్నారు.

విలక్షణ నటుడు ఎన్టీఆర్



తెనాలి అర్బన్: విలక్షణ నటుడు ఎన్టీ రామారావు అని మాచినేని వెంకటేశ్వరరావు, పులిపాక శ్రీకర్ పేర్కొన్నారు. ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం కొత్తపేటలోని పెన్షనర్స్ హాల్‌లో ఎన్టీఆర్ వ్యక్తిత్వంపై చర్చా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏడాది పాటు ఆడిన ఎన్టీఆర్ సినిమాలపై వారు ప్రసంగించారు. అనంతరం వక్తలతో పాటు ప్రముఖ సంగీత కళాకారుడు ముక్కాల మాణిక్యరావును సన్మానించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, దేవరపల్లి భవాని, ఎన్టీఆర్ జగన్, వెలగా సుభాష్‌చంద్రబోసు, దేవరపల్లి నీలాంబరం, కంచర్ల ఏడుకొండలు, సూర్యదేవర సత్యనారాయణ, మోహనరావు పాల్గొన్నారు.

పేద విద్యార్థికి ఆర్థిక సాయం



నగదును అందజేస్తున్న నరేంద్రకుమార్, డాక్టర్ ఉమ

తెనాలి: పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యుడు గోగినేని హరిప్రసాదరావు స్మారకార్థం ఆయన కుటుంబ సభ్యులు ఆదివారం ప్రతిభావంతుడైన విద్యార్థికి ఉన్నత చదువుల నిమిత్తం రూ.లక్ష ఆర్థిక సాయం చేశారు. హరిప్రసాదరావు కుమారుడు డాక్టర్ గోగినేని లక్ష్మీప్రసాద్, కోడలు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోగినేని ఉమ, మనుమడు సందీప్‌బాబు కొత్తపేటలోని నివాసంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐఐటీ సీఎస్‌సీ మొదటి సంవత్సరం చదువుతున్న ఎన్టీఆర్ జిల్లా గురజ గ్రామానికి చెందిన జాస్తి యశ్వంత్‌కు రూ.లక్షను సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిభకు పురస్కారం పేరుతో పేదరికంలో ఉన్న విద్యార్థులకు ఆర్థిక సాయం అందించడం అభినందనీయమని చెప్పారు. దాతల సాయాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోగినేని ఉమ మాట్లాడుతూ డాక్టర్ గోగినేని హరిప్రసాదరావు జ్ఞాపకార్థం ప్రతిభావంతులైన విద్యార్థులకు ఏటా ఉపకార వేతనాలను అందజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సూర్యదేవర వెంకటరమణ, గోగినేని బుల్లిప్రసాద్, తాడిబోయిన శ్రీనివాసరావు, గుమ్మడి రమేష్, నేలటూరి బెన్ను, చెరుకూరి సుబ్బారావు, కొడాలి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆధునిక సాహిత్యంలో హాస్యానికి ప్రత్యేక స్థానం

తెనాలి అర్బన్: ఆధునిక సాహిత్యంలో హాస్యానికి ప్రత్యేక స్థానం ఉందని ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, రచయిత పొన్నపల్లి గోపాలకృష్ణమూర్తి పేర్కొన్నారు. సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ తెనాలి సమావేశాన్ని ఆదివారం సాయంత్రం కవిరాజా పార్కులోని వడ్లమూడి గోపాలకృష్ణయ్య స్మారక సీనియర్ సిటిజన్స్ భవనంలో నిర్వహించారు. సాహిత్యం–హాస్యం అనే అంశంపై గోపాలకృష్ణమూర్తి ప్రసంగించారు. అనంతరం ఆయన్ను సన్మానించారు. కార్యక్రమంలో అధ్యక్ష, కార్యదర్శులు మొవ్వా సత్యనారాయణ, బొమ్మదేవర వెంకటేశ్వరరావు, నాయకులు హనుమారెడ్డి, చలమయ్య, సీతారామయ్య, రామకృష్ణ, డాక్టర్ అబ్బయ్య, పాల్గొన్నారు.

జీవన శైలి వ్యాధులతో జాగ్రత్త



డాక్టర్ హర్ష మండలపును సత్కరిస్తున్న క్లబ్ సభ్యులు

తెనాలి: జీవన శైలి వ్యాధులతో ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని పట్టణానికి చెందిన గ్రాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ హర్ష మండలపు సూచించారు. నియమబద్ధ జీవనంతో వీటినుంచి దూరంగా ఉండొచ్చని సూచించారు. వాకర్స్ క్లబ్ ఫిబ్రవరి సమావేశాన్ని ఆదివారం ఉదయం కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో నిర్వహించారు. క్లబ్ ఉపాధ్యక్షుడు కాకుమాను రామమోహనరావు అధ్యక్షత వహించారు. 'జెర్డ్, గ్యాస్ట్రయిటిస్, కాలేయంలో కొవ్వు చేరటం' తదితర వ్యాధులపై డాక్టర్ హర్ష మండలపు ప్రసంగించారు. ఆ వ్యాధులు ఒక్కరోజులో వచ్చేవి కాదన్నారు. ఏళ్ల తరబడి కారం, మసాలాలు అధికంగా ఉన్న ఆహారం తీసుకోవడం, పొగ, ఆల్కహాల్ తాగడం వల్ల వస్తాయని చెప్పారు. ఎక్కువ కాలం మందులు వాడకుండా, ఆహార నియమాలు పాటించకుండా, సరైన వ్యాయామం చేయకపోతే కొంత కాలానికి అల్సర్ ఏర్పడుతుందని వివరించారు. కాలేయానికి సిరోసిస్ అనే వ్యాధి సోకుతుందని తెలిపారు. వ్యాధి లక్షణాలు ఉన్నవారు డాక్టర్‌కు చూపించుకుని తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. క్లబ్ కార్యదర్శి కడియాల రవిబాబు స్వాగతం పలికారు. తొలుత వాకర్స్‌కు షుగరు, బీపీ పరీక్షలు చేశారు. కార్యక్రమంలో అచ్చయ్య, అశోక్, రత్తయ్య, సత్యనారాయణ, నరేంద్ర పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

తెనాలి రూరల్: పేకాట శిబిరంపై పోలీసులు దాడులు నిర్వహించి జూదరుల్ని అదుపులోకి తీసుకున్నారు. పట్టణ చినరావూరు తోటలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో ఆదివారం తెల్లవారుజామున వన్‌టౌన్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఎనిమిది మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.10,900 స్వాధీనం చేసుకున్నారు.

విజ్ఞాన ప్రదర్శనకు విశేష స్పందన



నమూనాలను పరిశీలిస్తున్న ఉమామహేశ్వర్, ప్రిన్సిపాల్ జేమ్స్ మోర్లే

తెనాలి అర్బన్: బుర్రిపాలెం రోడ్డులోని మాంటిస్సోరి ఇంగ్లిష్ మీడియం స్కూలులో రెండు రోజులుగా నిర్వహిస్తున్న మాంటిస్సోరి గాట్ టాలెంట్ ప్రదర్శనకు ఆదివారం విశేష స్పందన లభించింది. ఉదయం తొమ్మిది గంటలకు స్కూలు ప్రిన్సిపాల్ జేమ్స్ మోర్లే ప్రారంభించారు. తెనాలి పట్టణ, రూరల్ పరిధిలోని పలు పాఠశాలల విద్యార్థులు ప్రదర్శనలోని నమూనాలను పరిశీలించారు. కార్యక్రమంలో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వేజళ్ల ఉమామహేశ్వర్, అధ్యాపకులు సంజీవ్‌బాబు, వి.సరోజ, పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పల్లె వీధుల్లోకి సాహిత్యం విస్తరించాలి



సభలో మాట్లాడుతున్న గోలి లక్ష్మయ్య

పాత గుంటూరు: పల్లెవీధుల్లో కవి సమ్మేళనాలు పెట్టి సాహిత్యాన్ని గ్రామవీధుల్లో పరిమళింపజేయాలని బాపట్ల జిల్లా డీఎస్పీ గోలి లక్ష్మయ్య అన్నారు. ఆదివారం నవ్యాంధ్ర రచయితల సంఘం, పట్టాభి కళాపీఠం సంయుక్త ఆధ్వర్యంలో బ్రాడీపేటలోని ఎస్‌హెచ్‌వో సమావేశ మందిరంలో కవి మిత్రుల కలయిక-కవి సమ్మేళనం-పుస్తక సమీక్ష కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న గోలి లక్ష్మయ్య మాట్లాడుతూ పుస్తకం మానసిక వికాసానికి అద్భుతమైన ఐకాన్ లాంటిదని తెలిపారు. నవ్యాంధ్ర రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి కలిమిశ్రీ మాట్లాడుతూ మంచి పుస్తకాలు మనిషి ఎదుగుదలకు దోహదం చేస్తాయని, నవ్యాంధ్ర రచయితల సంఘం జ్ఞాపికలుగా పుస్తకాలనే అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో అరసం పల్నాడు జిల్లా కన్వీనర్ కోసూరి రవికుమార్, యేమినేని వెంకటరమణ, సంఘ జిల్లా అధికార ప్రతినిధి బండికల్లు జమదగ్ని పాల్గొన్నారు.

రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి చర్యలు

- ఎమ్మెల్యే కోన రఘుపతి
- పడమర బాపట్లలో గడప గడపకు మన ప్రభుత్వం



ప్రజలకు కరపత్రాలు అందజేసి నవరత్నాల పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల అర్బన్: ప్రజలు ఎదుర్కొంటున్న స్థానిక సమస్యల పరిష్కారానికి తగిన ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఎమ్మెల్యే కోన రఘుపతి తెలిపారు. బాపట్ల మండలంలోని పడమర బాపట్ల పంచాయతీలోని మహాత్మజిపురం, జీవీఎస్ కాలనీ, దరివదాకొత్తపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రధాన సమస్యలు అంతర్గత రోడ్లు, విద్యుత్ స్తంభాలు, డ్రెయినేజీ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. సచివాలయ వ్యవస్థతో సుపరిపాలన అందిస్తుండడంతో ఇతర రాష్ట్రాల చూపు మన రాష్ట్రం వైపు ఉందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలే మంత్రంగా వచ్చే ఎన్నికలకు వెళ్తామని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి, ఎంపీపీ చిన్నపోతుల హరిబాబు వడ్డిముక్కల డేవిడ్ గవిని కృష్ణమూర్తి, ఆసోది నాగార్జున రెడ్డి ఆట్ల ప్రసాద్ రెడ్డి, ఎంపీడీఓ ఏ రాధాకృష్ణ, వీఆర్వో మస్తాన్ వలి, పంచాయతీ కార్యదర్శి రవికృష్ణ, బాపట్ల రూరల్ ఎస్ఐ పున్నారావు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్ అస్విల్‌కు సన్మానం



అస్విల్ అహ్మద్‌ను సత్కరిస్తున్న ఎంసీఏ సభ్యులు

రేపల్లె రూరల్: పట్టణానికి చెందిన ఎన్‌సీసీ క్యాడెట్ షేక్ అస్విల్ అహ్మద్‌ను ఆదివారం సన్మానించారు. రిపబ్లిక్ డే క్యాంపు 2023, ప్రధానమంత్రి వార్షిక ఎన్‌సీసీ ర్యాలీ 2023లో పాల్గొనే అరుదైన అవకాశం, ఘనత సాధించిన నేపథ్యంలో పట్టణంలోని శ్రీ గుత్తికొండ లక్ష్మీనారాయణ కల్యాణ మండపంలో మెడికల్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. చిన్న వయసులోనే అస్విల్ అహ్మద్ అందిపుచ్చుకున్న అవకాశాలను, సాధించిన విజయాలను పలువురు కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు లక్ష్మణుడు, ఎంసీఏ సెక్రటరీ బాపారావు, ఎంసీఏ మాజీ ఉపాధ్యక్షుడు డాక్టర్ వేజళ్ల ప్రకాశరావు, నగరం కళాశాల ప్రిన్సిపాల్ హనుమంతరావు, డాక్టర్ వేజళ్ల పూర్ణానంద్, 25వ ఆంధ్ర బెటాలియన్ గుంటూరు జిల్లా ఆఫీసర్ సుబేదార్ మేజర్ విజయ్ మోహితే, విజ్ఞాన్ యూనివర్సిటీ ఆఫీసర్ లెఫ్టినెంట్ శివ కోటేశ్వరరావు, ఎన్‌సీసీ ఆఫీసర్ శివకోటేశ్వరరావు, ఆదర్శ కరస్పాండెంట్ మొహిద్దీన్ పాల్గొన్నారు.

ఉపకరణాల కోసం వైద్య నిర్ధారణ శిబిరం



విద్యార్థులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

బాపట్ల అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల విద్య కోసం అధిక ప్రాధాన్యత ఇస్తోందని జిల్లా విద్యాశాఖ అధికారి పి.జె.వి.రామారావు అన్నారు. పట్టణంలోని ఏబీఎం హైస్కూల్లో ఉచిత సహాయ ఉపకరణాల వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. సమగ్ర శిక్ష ద్వారా దివ్యాంగ పిల్లలకు అందుతున్న పరికరాలు, ప్రభుత్వ సహాయం గురించి వివరించారు. ఈ క్యాంపు ద్వారా 48 వినికిడి యంత్రాలు, 16 మందికి వీల్ చైర్స్, 12 మందికి టీడబ్ల్యూఎం కిట్లు అవసరం ఉన్నట్లు నిర్ధారించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా సమన్వయకర్త జి.నాగేంద్రమ్మ, స్కూల్ అసిస్టెంట్లు, సైకాలజిస్ట్ డాక్టర్ కోటేశ్వరరావు, డాక్టర్ లాస్య, ఆడియాలజిస్ డాక్టర్ నాగేశ్వరరావు, ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ శ్రీధర్ పాల్గొన్నారు.

విశ్రాంత ప్రిన్సిపాల్ సత్యబాబుకు ఘన నివాళి



సత్యబాబు చిత్రపటం వద్ద ప్రముఖుల నివాళి

తెనాలి: విద్యా బోధకుడిగా, సామాజిక, ఆధ్యాత్మిక సేవకుడిగా జీవితాన్ని గడిపిన విశ్రాంత ప్రిన్సిపాల్ పాణుకుమాటి సత్యబాబు మానవతకు ప్రతిరూపమని వక్తలు కొనియాడారు. ఆదివారం జరిగిన సంస్మరణ సభకు అధ్యాపక ప్రముఖుడు బలహారనాథమూర్తి అధ్యక్షత వహించారు. హిందూ పత్రిక విశ్రాంత పాత్రికేయుడు ఆర్.సంపత్ మాట్లాడుతూ నాయుడమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏటా విశిష్ట శాస్త్రవేత్తకు ప్రదానం చేసే అవార్డు బహూకరణ ఉత్సవానికి సత్యబాబుకు గల అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు పి.విష్ణుమూర్తి మరణం తర్వాత ఆ ట్రస్ట్‌ను కేంద్ర చర్మపరిశోధన సంస్థ, చెన్నైలో విలీనం చేసేందుకు సత్యబాబు చేసిన కృషిని బలహరినాథమూర్తి, ఆడిటర్ వెంకట్రావు వెల్లడించారు. వైకుంఠపురం దేవస్థానం, దేవీచౌక్‌లోని శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానాల్లో సంకీర్తనలు, కార్యక్రమాల నిర్వహణలో ఆధ్యాత్మిక సేవకుడిగా సత్యబాబు పాత్రను పలువురు గుర్తు చేశారు. బ్రాహ్మణ వధూవరుల పరిచయ వేదిక కార్యదర్శిగా పాతికేళ్లుగా ఆయన నిస్వార్థ సేవను పలువురు స్మరించుకున్నారు. కామర్స్ బోధనలో పట్టణంలో సత్యబాబుకు మరొకరు సాటి రారని విశ్రాంత ప్రిన్సిపాల్ నాగిరెడ్డి తెలిపారు. మహేంద్ర స్వాగతం పలికిన సభలో విశ్రాంత ప్రిన్సిపాల్ వింతా మోహనరెడ్డి, అర్జునరావు, జి.ఆంజనేయ శాస్త్రి, కొండపి శ్రీనివాసరావు, బాలరాజు, పరుచూరి సుబ్బా రావు, వెంకటరత్నం, గంగాధరరావు, సుబ్బారావు, భారతి, భాస్కర్ మాట్లాడారు. కార్యక్రమాన్ని ఉషారాణి, పద్మావతి, గోవిందు పర్యవేక్షించారు.

పంట, మురుగు కాల్వలకు మరమ్మతులు చేపట్టాలి

ప్రభుత్వానికి రైతు సంఘం వినతి

తెనాలి: కృష్ణా పశ్చిమ డెల్టా పరిధిలోని పంట, మురుగు కాల్వలకు మరమ్మతులు చేపట్టేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి లేఖ రాసినట్టు ఆదివారం ఇక్కడి ప్రజాసంఘాల కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వెల్లడించారు. చినరావూరు–జంపని గ్రామాల మధ్య గల రైల్వే లెవెల్ క్రాసింగ్‌ను మూసి వేయడంతో నాలుగు మండలాల్లోని ఎనిమిది గ్రామాలకు చెందిన రైతులు వ్యయప్రయాసలకు గురవుతున్నట్టు తెలిపారు. ఎల్‌సీ నెం.257 రైల్వే గేటును వెంటనే తెరిపించేందుకు ప్రభుత్వం తరఫున చర్యలు తీసుకోవాలని కోరారు. పసుపు రైతుకు ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర సరిపోవడం లేదని, కనీసం రూ.10 వేలకు పెంచాలని విజ్ఞప్తి చేశారు. మార్కెట్ యార్డు సెస్సు ద్వారా గ్రామాల్లో లింకు రోడ్ల నిర్మాణం చేపట్టాలని, రైతుబంధు పథకం ద్వారా యార్డుల్లో ధాన్యం, అపరాలు నిల్వ చేసుకునే అవకాశాన్ని పునరుద్ధరించాలని విన్నవించారు. నూటికి 70 శాతం పైగా కౌలు రైతులు 2019 చట్టం వల్ల నష్టపోతున్నారని, వెంటనే ప్రభుత్వం 2011 చట్టాన్ని పునరుద్ధరించాలని ఆ లేఖలో కోరినట్టు సాంబిరెడ్డి వివరించారు.

నేటి నుంచి జాతీయ సైన్స్ దినోత్సవ సంబరాలు

గుంటూరు ఎడ్యుకేషన్: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని చిల్డ్రన్స్ స్పేస్ క్లబ్ ఆధ్వర్యంలో సోమ, మంగళవారాల్లో వివిధ విద్యాసంస్థల్లో విద్యార్థులకు అంతరిక్ష విజ్ఞానంపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపకుడు జి. శాంతమూర్తి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అంతరిక్ష విజ్ఞాన అవగాహన కార్యక్రమంలో భాగంగా ఇటీవల వివిధ పాఠశాలలు, కళాశాలల్లోని వందలాది మంది విద్యార్థులకు రాకెట్ సైన్స్‌పై అవగాహన కల్పించామని వివరించారు. తాజాగా సోమ, మంగళవారాల్లో విద్య, విజ్ఞాన రంగాల్లో ఇస్రో పాత్రపై శాస్త్రవేత్త యాళ్ల శివప్రసాద్ ఆధ్వర్యంలో అవగాహన కల్పిస్తామని ఆయన పేర్కొన్నారు.